సాక్షి
పార్వతీపురం మన్యం

బుధవారం । 13 । డిసెంబర్ । 2023



అంగన్‌వాడీల్లో ఆంగ్లబోధన
అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన ఆంగ్ల విద్యాబోధనను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. - 8లో



ఊరూరా వికసిత్ భారత్ సంకల్పయాత్ర - 8లో
పార్వతీపురం మన్యం జిల్లాలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఊరూరా సాగుతోంది.



సెమీస్‌కు చేరిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు - 8లో
విజయనగరం వేదికగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలు సెమీస్‌కు చేరాయి.

న్యూస్‌రీల్

వైఎస్సార్‌సీపీలో కొత్త నియామకాలు

పార్వతీపురంటౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ సంస్థాగతంగా కొత్త నియామకాలు చేపడుతోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పలువురికి కొత్త బాధ్యతలు అప్పగిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర మహిళా విభాగం పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శిగా గోగు కళ్యాణి, సంయుక్త కార్యదర్శిగా గుల్లిపల్లి సునీతకు బాధ్యతలు అప్పగించారు. రాష్ట్ర యువజన విభాగ కమిటీకి పార్వతీపురం మన్యం జిల్లా నుంచి ముగడ జగన్మోహన్‌రావు, సంయుక్త కార్యదర్శిగా నిమ్మక గోపాల్ నియామకమయ్యారు. 2024 సంవత్సరంలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో యువజన, మహిళా విభాగాల్లో చైతన్యం కల్పించి పార్టీని విజయపథంలో నడిపించే దిశగా నియామకాలు చేపట్టారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



మాట్లాడుతున్న జీసీడీఓ రోజారమణి

సీతానగరం: జిల్లాలోని కేజీబీవీల్లో శతశాతం ఉత్తీర్ణత సాధనే లక్ష్యంగా విద్యాప్రణాళికలు అమలుచేయాలని జీసీడీఓ కె.రోజారమణి సూచించారు. సీతానగరం మండలం జోగింపేట కేజీబీవీని ఆమె మంగళవారం సందర్శించారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువుతున్న బాలికలందరూ ఉత్తీర్ణతతో పాటు అధిక మార్కులు సాధించేలా తర్ఫీదునివ్వాలన్నారు. సులభ పద్ధతుల్లో బోధన సాగించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన 100 రోజుల ప్రణాళికను అమలుచేయాలని సూచించారు. చదువులో వెనుకబడిన పిల్లలపై ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలన్నారు. సిలబస్‌ను పూర్తిచేసి రివిజన్ చేయాలన్నారు. వసతి గృహాలకు తాజా కూరగాయలు సరఫరా చేయని పక్షంలో తిరస్కరించాలని సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలువురు సీఐలకు బదిలీ

విజయనగరం క్రైమ్: పలువురు సీఐలను బదిలీ చేస్తూ విశాఖ రేంజ్ డీఐజీ హరికృష్ణ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. పార్వతీపురం రూరల్ సీఐగా పనిచేస్తున్న బీసీహెచ్ స్వామినాయుడును వీఆర్‌కు, రాజాంటౌన్ సీఐ కె.రవికుమార్‌ను పార్వతీపురం రూరల్ సర్కిల్‌కు బదిలీచేశారు. అలాగే, అనకాపల్లి టౌన్‌సీఐగా పనిచేస్తున్న డి.మోహనరావును రాజాం టౌన్‌కు, శ్రీకాకుళం డీసీఆర్‌బీ సీఐగా పనిచేస్తున్న డి.నవీన్‌కుమార్‌ను కాశీబుగ్గటౌన్‌కు, వీఆర్‌లో ఉన్న ఎస్.శ్రీనివాసరావుకు శ్రీకాకుళం డీసీఆర్‌బీ, వీఆర్‌లో ఉన్న బి.లలితను విజయనగరం వీఆర్‌కు బదిలీ చేశారు.

పుష్పాలంకరణలో పైడితల్లి



చదురుగుడిలో పైడితల్లికి కమలాపండ్లతో నివేదన



వనంగుడిలో పుష్పాలంకరణలో పైడితల్లి

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు జరిపారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు శాస్త్రోక్తంగా పూజాధికాలు చేశారు. అమ్మవారికి కమలా పండ్లను నైవేద్యంగా సమర్పించారు. మహిళలు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించారు. మొక్కుబడులు చెల్లించారు. కార్యక్రమాలను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

వెబ్‌సైట్‌లో టీటీసీ హాల్‌టికెట్లు

విజయనగరం అర్బన్: టీటీసీ లోయర్ గ్రేడ్ థియరీ పరీక్ష హాల్‌టికెట్లు వెబ్‌సైట్‌లో ఉన్నాయని డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17వ తేదీన రెగ్యులర్ అండ్ వన్స్ ఫెయిల్డ్ ప్రైవేట్ అభ్యర్థులు తమ హాల్‌టికెట్‌లను 'బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఐఎన్' వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. విశాఖ, కాకినాడ, గుంటూరు, వైఎస్సార్ కడప, అనంతపురం కేంద్రాల్లో ఈ పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యేవారు ఫొటో ఐడెంటిటీగా పాస్‌పోర్ట్, పాన్ కార్డు, ఓటర్ ఐడీ, ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ తదితర ఏదైనా ఒక గుర్తింపు కార్డు తీసుకెళ్లాలన్నారు.



బట్టివలస సమీపంలో నిర్మాణంలో ఉన్న వంతెన



కందులపదం వంతెనను ప్రారంభిస్తున్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు (ఫైల్)



శ్లాబ్ పూర్తయిన ఈతమానువలస బ్రిడ్జి

ప్రగతి వారధులు



ఇది పాచిపెంట మండలం మోసూరు వద్ద వట్టిగెడ్డపై రూ.8 కోట్ల పంచాయతీరాజ్ నిధులతో నిర్మించిన వంతెన. గతంలో వర్షంకురిస్తే కొండలపై నుంచి వచ్చిన వరదనీటికి ఇక్కడ ఉన్న చిన్నపాటి వంతెన కోతకు గురయ్యేది. వరద నీరు వంతెనపై నుంచి ప్రవహించేది. తాత్కాలిక మరమ్మతుల పేరిట నిధులు వృథా అయ్యేవి. ఏటా వర్షాకాలంలో కష్టాలు షరామామూలుగానే ఉండేవి. డిప్యూటీ సీఎం రాజన్నదొర చొరవతో ఇక్కడ శాశ్వత వంతెన నిర్మాణం పూర్తియింది. దీంతో ఈ ప్రాంత ప్రజలకు రాకపోకల సదుపాయం కలిగింది. వర్షం కురిస్తే దారి ఉండదన్న బెంగ తీరింది.



నాడు వంతెన నిర్మాణానికి ముందు కందులపదం పరిసర ప్రాంతాల ప్రజల కష్టాలు



నేడు పూర్తయిన కందులపదం వంతెన

ఈ రెండు చిత్రాలు సాలూరు మండలం కందులపదం గ్రామం వద్ద గోముఖినది వద్ద తీసినవి. గతంలో వర్షం కురిస్తే చాలు.. కందులపదం ప్రాంతంలోని సుమారు 50 గ్రామాల ప్రజల్లో వణుకుపుట్టేది. గోముఖినదిలో నీటి ఉధృతి పెరిగి బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోయేవి. ఆపదవేళ సాహసించి నదిలో ప్రయాణించే వారు ప్రమాదాల్లో చిక్కుకునేవారు. వరద ఉధృతి తగ్గేవరకు రాకపోకలు నిలిచిపోయేవి. ఇక్కడ వంతెన నిర్మించాలని దశాబ్దాలుగా కోరుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. ఈ ప్రాంత ప్రజల సమస్యను డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి రాజన్నదొర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వంతెన ఆవశ్యకతను వివరించారు. అంతే... ఆయన రూ.5.30 కోట్లు కేటాయించారు. ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో వంతెన నిర్మాణం పూర్తిచేయించారు. జాతికి అంకితం చేశారు. దీంతో ఈ ప్రాంత ప్రజలకు రాకపోకల కష్టాలు తీరాయి. వ్యవసాయ ఉత్పత్తుల తరలింపు సులభతరమైంది. అత్యవసర సేవలు అందుతున్నాయి.

- మన్యంలో చురుగ్గా వంతెనల నిర్మాణం
- ఇప్పటికే కందులపదం, మోసూరు తదితర చోట్ల వంతెనల నిర్మాణం పూర్తి
- తొలగిన దశాబ్దాల కష్టాలు
- చినుకుపడినా చింత లేకుండా ప్రయాణం సాగిస్తున్న వందలాది గ్రామాల ప్రజలు

సాలూరు: చినుకుపడితే వారికి చింతే. వర్షం తీవ్రత పెరిగే కొద్దీ వారి గుండెల్లో గుబులుపుడుతుంది. జలదిగ్బంధంలో తమ గ్రామాలు చిక్కుకుంటాయన్న ఆందోళన. వరద ఉధృతి ఎప్పుడు తగ్గుతుందా అని బిక్కుబిక్కుమంటూ ఎదురుచూడాల్సిన పరిస్థితి. తుఫాన్ వస్తుందంటే చాలు భయంభయంతో గడుపుతారు. వాగులు, గెడ్డల్లో నీటిప్రవాహం పెరిగి రాకపోకలు నిలిచిపోతాయన్న బెంగ వారిలో కనిపిస్తుంది. ఇదంతా గతం. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏజెన్సీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించింది. ప్రత్యేకంగా పార్వతీపురం మన్యం జిల్లాను ఏర్పాటుచేసి గిరిజన సంక్షేమానికి పెద్దపీట వేసింది. రాకపోకల సమస్యను నివారించేలా ఏజెన్సీలో రోడ్ల నిర్మాణం చేపట్టింది. దశాబ్దాలుగా గిరిజనులను వెంటాడుతున్న వంతెన సమస్యలకు పరిష్కారం చూపింది. ఇప్పటికే కొన్ని నిర్మాణాలను పూర్తిచేయగా, మరికొన్ని వంతెన నిర్మాణాల్లో జోరు పెంచింది. దీనికోసం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. మన్యం పాలకులు, అధికారులు సమష్టి కృషితో జిల్లా ప్రగతి 'మార్గం'లో పయనిస్తోంది.

మన్యంలో వంతెనల నిర్మాణం ఇలా...

- సుమారు కోటి రూపాయల ఖర్చుతో పాచిపెంట మండలం పద్మాపురం నుంచి ఈతమానువలస మధ్యలో మీసాల గెడ్డపై వంతెన శ్లాబ్ పూర్తయింది.
- సుమారు కోటి రూపాయల వ్యయంతో కొండ మోసూరు నుంచి దొరలుద్దండి మధ్యలో పెద్దగెడ్డపై చేపట్టిన వంతెన నిర్మాణం చివరిదశలో ఉంది.
- సాలూరు మండలం తుండ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి మక్కువ వెళ్లే రోడ్డు మధ్యలో బట్టివలస వద్ద అడారు గెడ్డపై సుమారు రూ.కోటి వ్యయంతో చేపట్టిన బ్రిడ్జి శ్లాబ్ పూర్తయింది.
- సాలూరు–మక్కువ మండలాల మీదుగా వెళ్లే నంద–తుండ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి సీబిలి మధ్యలో గోముఖి నదిపై చేపట్టిన వంతెన నిర్మాణం శ్లాబ్ పూర్తయింది. మిగిలిన పనులు జోరుగా సాగుతున్నాయి.
- సాంపిగాం, కురుకూటి, ఆలూరు–మోదుగ మధ్య, గుంటభద్ర, లింగాలవలస మధ్య సారిక గెడ్డపైన, నేరెళ్లవలస, వెలగవలస వద్ద వాగులపై వంతెన నిర్మాణాలు చేపట్టారు.

కష్టాలు తీరాయి..



జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమంతో పాటు అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యమిస్తోంది. మన్యంలో రోడ్ల నిర్మాణంతో పాటు దశాబ్దాల తరబడి రాకపోకలకు ప్రతిబంధకంగా ఉన్న వంతెన నిర్మాణాలను పూర్తి చేసింది. గిరిజన గ్రామాలకు 'మార్గం' సుగమం చేసింది. ఈ ప్రాంత గిరిజనులు ఎన్నిసార్లు విన్నవించినా గత టీడీపీ నాయకులు పట్టించుకోలేదు. రాజన్నదొర కృషికి ఏజెన్సీలో నిర్మించిన వంతెనలే నిదర్శనం.

– బద్నాన ప్రమీల, ఎంపీపీ, పాచిపెంట మండలం

కల నేరవేరింది..



వర్షాలు కురిస్తే కందులపదం వద్ద గోముఖి నది ఉగ్రరూపం దాల్చుతుంది. నదిని దాటే పరిస్థితి ఉండదు. అత్యవసర వేళ నదిని దాటే సమయంలో ఎంతోమంది కొట్టుకుపోయారు. ప్రాణాలు విడిచారు. మూగ జీవాలు సైతం మృత్యువాత పడ్డాయి. సుమారు 50కు పైగా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయేవి. మా ఇబ్బందులను గుర్తించి, వంతెన నిర్మించిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు. గిరిజనుల వంతెన కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపారు.

– కొలిక పుష్పారావు, మావుడి, సాలూరు మండలం

దారి సమస్యకు పరిష్కారం



గత టీడీపీ నాయకులు ఎన్నికల వేళ ప్రజలను మభ్యపెట్టేందుకు కందులపదం వంతెనకు కొబ్బరికాయలు కొట్టి భూమి పూజచేసేవారే తప్ప ఏ నాడూ పనులు చేపట్టలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వంతెన నిర్మాణం పూర్తిచేసి ప్రజలకు అంకితం చేసింది. చేతల ప్రభుత్వంగా నిరూపించింది. మన్యంలో కోట్లాది రూపాయల వ్యయంతో వంతెనలు, కాజ్‌వేలు నిర్మిస్తుండడం ఆనందంగా ఉంది. ఈ ప్రాంత అభివృద్ధికి చక్కని బాటలు వేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, డిప్యూటీ సీఎం రాజన్నదొరకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– దండి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి, సాలూరు మండలం

'స్వచ్ఛంద' సహకారం అవసరం

- జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రోగ్రాం మేనేజర్ బాలాజీ



సమావేశంలో మాట్లాడుతున్న బాలాజీ

విజయనగరం ఫోర్ట్: హెచ్ఐవీ రోగులకు స్వచ్ఛంద సంస్థలు సహకారం అందించాలని జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి ప్రోగ్రాం మేనేజర్ పి.బాలాజీ కోరారు. స్థానిక ఏఆర్‌టీ కేంద్రంలో స్వచ్ఛంద సంస్థలతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రాన్స్‌జెండర్లకు, స్వలింగ సంపర్కులకు, నిస్సహాయ మహిళలకు హెపటైటీస్–బి, సి పరీక్షలతో పాటు వ్యాక్సిన్లను అందించాలన్నారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్తులు ఏఆర్‌టీ మందులు వినియోగించేలా చూడాలన్నారు. సమావేశంలో ఏఆర్‌టీ కేంద్రం వైద్యులు డాక్టర్ వరలక్ష్మి, డాక్టర్ జ్యోతిర్మయి, సోనిలాల్, పద్మ పాల్గొన్నారు.

కార్తీక దీపోత్సవం

సాలూరు పట్టణంలోని పంచముఖేశ్వర స్వామి, కామాక్షమ్మ ఆలయాల్లో కార్తీక దీపోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు. దీపారాధన చేశారు.

– సాలూరు



కామాక్షమ్మ ఆలయంలో దీపారాధన చేస్తున్న భక్తులు



పంచముఖేశ్వర స్వామి ఆలయంలోని భవతారిణి పుష్కరిణి వద్ద దీపారాధనలో పాల్గొన్న మహిళలు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

- పీఐబీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ధీరజ్ కకాడియా



డి.తాళ్లవలసలో ప్రకృతి వ్యవసాయ స్టాల్‌ను పరిశీలిస్తున్న పీఐబీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ధీరజ్ కకాడియా



తాటిపూడిలో పొదుపు సంఘాల మహిళలకు 82.73లక్షల విలువైన చెక్కు అందజేస్తున్న ధీరజ్ కకాడియా

డెంకాడ/గంట్యాడ: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలన్న లక్ష్యంతో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహిస్తున్నట్టు పీఐబీ అడిషనల్ డైరెక్టర్ జనరల్ ధీరజ్ కకాడియా అన్నారు. డెంకాడ మండలంలోని డి.తాళ్లవలస, గంట్యాడ మండలంలోని తాటిపూడిలో మంగళవారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్రలో ఆయన పాల్గొన్నారు. ఐసీడీఎస్, వ్యవసాయ శాఖ, వైద్య, ఆరోగ్యశాఖలు ఏర్పాటుచేసిన వివిధ స్టాల్స్‌ను సీబీసీ అసిస్టెంట్ డైరెక్టర్ షాఫీ మహమ్మద్‌తో కలిసి సందర్శించారు. ఉత్తమ రైతులు, వంద రోజులు పనిదినాలు పూర్తి చేసుకున్న వారిని, సీనియర్ సిటిజన్‌లను సన్మానించారు. పలువురు లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ధీరజ్ కకాడియా మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన, కిసాన్ సమ్మాన్ యోజన, పోషణ్ అభియాన్, ప్రధానమంత్రి మాతృత్వ యోజన, ఆయుష్మాన్ భారత్, ప్రధానమంత్రి ఉజ్వలయోజన తదితర పథకాల ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు అందించేందుకు విద్యావంతులు వారి గ్రామాల్లో అర్హులకు అందేలా పనిచేయాలని కోరారు. 2047 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పని చేస్తున్నారని వివరించారు. నిక్షయ మిత్రల ద్వారా క్షయవ్యాధి గ్రస్తులకు ఫుడ్ బాస్కెట్స్‌ను పంపిణీచేశారు. ముందుగా మదనాపురం కేజీబీవీ బాలికలు నృత్య ప్రదర్శనలతో అలరించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ రాణి, వికసిత్ భారత సంకల్ప యాత్ర రాష్ట్ర నోడల్ అధికారి తారక ప్రసాద్, జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్ కుమార్, సర్వేశాఖ ఏడీ త్రివిక్రమరావు, డెంకాడ మండల ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, సర్పంచ్‌లు టి.త్రిమూర్తులు, ఎ.సూర్యనారాయణ, ఎంపీడీఓలు స్వరూపారాణి, వై.భవానీ తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, ఏఓ పి.నిర్మల పాల్గొన్నారు.

యాదవుల్లో 'సంక్షేమ' వెలుగులు

- పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



కార్తీక వనసమారాధనలో మాట్లాడుతున్న రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

బొండపల్లి: రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని యాదవుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని గొట్లాం గ్రామ సమీపంలో జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్తీక వనసమారాధన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవులకు సముచిత స్థానం కల్పించడంతో పాటు వివిధ పథకాల కింద ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు నింపారన్నారు. ఆర్థికోన్నతికి అనువుగా వివిధ పథకాలు అందజేశారన్నారు. యాదవవర్గాన్ని అన్ని విధాలుగా ఆదుకోవడంతో పాటు సంక్షేమ పథకాలు అందజేశారని గ్రేటర్ విశాఖపట్టణం మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. గొర్రెలు, మేకలు పెంపకం దారులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవడంతో పాటు అనేక రాయితీలు కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఫుడ్ కమిషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు బి.కాంతారావు, యాదవుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మన్యాల కృష్ణ, యాదవుల హక్కుల పోరాట సమితి జాతీయ నాయకులు విసిరపు శేఖర్, మన్యాల శ్రీనివాస్, రామకృష్ణ పాల్గొన్నారు. ముఖ్య అతిథులను సత్కరించారు. వివిధ సాంస్కృతిక పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

డెంకాడ: మండలంలోని మోదవలస వీఆర్‌ఓ ఫిర్యాదు మేరకు ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్లు డెంకాడ పోలీసులు మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పంచాయతీ పరిధి ఫాటోగ్యాలరీ ప్రాంతంలో విజయనగరం-విశాఖ జాతీయ రహదారి పక్కన గుర్తు తెలియని వ్యక్తి పడి ఉండడాన్ని గమనించి, స్థానికుల సమాచారంతో వచ్చిన 108 అంబులెన్స్ సిబ్బంది వాహనంలో విజయనగరం ఆస్పత్రికి తీసుకువెళ్లారు. ఆ వ్యక్తి చికిత్స పొందుతూ 11వ తేదీ రాత్రి మరణించాడు. ఈ మేరకు వీఆర్‌వో గణేష్ ఫిర్యాదు చేయడంతో డెంకాడ ఎస్సై మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరణించిన వ్యక్తి వయస్సు 65 నుంచి 70 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఎవరైనా సంబంధీకులు ఉండి వివరాలు తెలిస్తే డెంకాడ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని ఎస్సై మహేష్ కోరారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

దత్తిరాజేరు: మండలంలోని ఇంగిలాపల్లి గ్రామానికి చెందిన ఎస్.అప్పారావు(59) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు పెదమానాపురం ఏఎస్సై కాశీరావు మంగళవారం తెలిపారు. అప్పారావు కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధ పడుతూ ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోమవారం రాత్రి పురుగు మందు తాగేశాడు. స్థానికులు గమనించి వెంటనే గజపతినగరం విజయనగరం సర్వజన ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని మొదటి భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు సిబ్బందిని పంపించి వివరాలు సేకరించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి రెండో భార్య అన్నపూర్ణ ఆరుగురు పిల్లలు ఉన్నారు.

పోరాంలో అగ్నిప్రమాదం


ప్రమాద పరిస్థితిని తెలుసుకుంటున్న ట్రైనీ కలెక్టర్ త్రివినాగ్

మెంటాడ: మండలంలోని పోరాం గ్రామానికి చెందిన మామిడి వెంకన్న ఇంట్లో అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంపై స్థానిక వీఆర్వో అప్పలకొండ తెలిపిన వివరాల ప్రకారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో రూ.30వేల నగదుతో పాటు 40వేల ఖరీదు చేసే ఇంటి సామగ్రి కాలిపోయింది. ఈ సమాచారం తెలుసుకున్న ట్రైనీ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాద పరిస్థితిని పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ రామకృష్ణతో పాటు, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకుడు రత్నాకర్ ఉన్నారు.

520 కేజీల పీడీఎస్ బియ్యం సీజ్


సీజ్ చేసిన బియ్యం వద్ద సీఎస్‌డీటీ తదితరులు

కొత్తవలస: మండలంలోని మిందిరామచంద్రపురం గ్రామంలో హనుమాన్‌శెట్టి బాబాజీ ఇంటి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 520 కేజీల పీడీఎస్ బియ్యాన్ని సీఎస్‌టీడీ కె.ఇందిర మంగళవారం సాయంత్రం సీజ్ చేశారు. ఓ అజ్ఞాన వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు సీఎస్‌డీటీ ఇందిర, వీఆర్‌ఓ గౌరిలు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పట్టుబడిన 520 కేజీల బియ్యాన్ని సీజ్ చేసి చెంతనే గల డీలర్ వద్ద భద్రపర్చినట్లు సీఎస్‌డీటీ ఇందిర తెలిపారు. కాగా ఇదే వ్యక్తి వద్ద రెండు నెలల క్రితం 1532 కేజీల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు సదరు వ్యక్తిపై మరో మారు 6ఎ కేసు నమోదు చేసినట్లు సీఎస్‌డీటీ ఇందిర తెలిపారు.

పెంకుటిళ్లు దగ్ధం

పార్వతీపురం: మండలంలోని నర్సిపురం పెద్ద వీధిలో మాచర్ల శ్రీరాములు, లచ్చిపతుల ఉమామహేశ్వరరావులకు చెందిన పెంకుటిళ్లు మంగళవారం సాయంత్రం అగ్నిప్రమాదంలో కాలిపోయాయి. మాచర్ల శ్రీరాములు ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో ఉన్న విలువైన ఆస్తులు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ మేరకు స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం చేరవేయడంతో సంఘటన స్థలానికి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. జరిగిన నష్టంపై అధికారులు అంచనా వేయాల్సి ఉంది.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹190

అంగన్‌వాడీల్లో ఆంగ్లబోధన

- కేంద్రాలకు రావడానికి ఇష్ట పడుతున్న పిల్లలు
- పిల్లలు ఇష్టపడేలా భోజనం
- గర్భిణులు, బాలింతలకు మంచి పౌష్టికాహారం


సాలిపేట అంగన్‌వాడీ కేంద్రంలో గుడ్డు తింటున్న పిల్లలు


గంట్యాడ మండలంలోని అంగన్ వాడీ కేంద్రంలో బొమ్మలకు రంగులు దిద్దుతున్న చిన్నారులు

విజయనగరం ఫోర్ట్: అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు స్వచ్ఛందంగా వచ్చే విధంగా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. పిల్లలకు అందించే విద్య దగ్గర నుంచి పౌష్టికాహారం వరకు అన్నింటా మార్పులు తీసుకొచ్చింది. గత టీడీపీ ప్రభుత్వం కంటే మెరుగైన సౌకర్యాలను అంగన్‌వాడీ కేంద్రాల్లో కల్పించింది. పిల్లలకు పెట్టే భోజనంలో పూర్తిస్థాయిలో మార్పులు చేసింది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు కాన్వెంట్లకు దీటుగా విద్యను బోధిస్తోంది.

పీపీ కిట్లు పంపిణీ

అంగన్‌వాడీ కేంద్రాలకు గతంలో పిల్లలను పంపించడానికి తల్లిదండ్రులు ఆసక్తి కనబరిచేవారుకాదు. ఆంగ్ల మాధ్యమంలో పిల్లలు పట్టు సాధించే విధంగా జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో కాన్వెంట్ల తరహాలోనే ఆంగ్లం బోధిస్తున్నారు. పిల్లల బోధనకు సంబంధించి 3 నుంచి 4 సంవత్సరాల లోపు పిల్లలకు ఇంగ్లీష్ , మ్యాథ్స్, స్పోకెన్ ఇంగ్లీష్, యాక్టివిటీ, డ్రాయింగ్‌లకు సంబంధించిన ఐదు పుస్తకాలతో కూడిన పీపీ-1 కిట్, 4 సంవత్సరాల నుంచి 5 సంవత్సరాల వయసు గల పిల్లలకు ఐదు పుస్తకాలతో కూడిన పీపీ కిట్-2ను ప్రభుత్వం అందజేసింది. వాటితో పిల్లలకు బోధిస్తున్నారు. కిట్‌లో బొమ్మలు దిద్దడానికి అవసరమైన కలర్ పెన్సిల్స్, జంతువులు గుర్తించే బొమ్మలు అందించారు. పిల్లలకు బొమ్మలు, ఆటపాటలతో చదువు చెప్పడంతో అంగన్ వాడీ కేంద్రాలకు రావడానికి పిల్లలు ఆసక్తి కనబరుస్తున్నారు. ఆరోగ్యంగా, బలంగా ఉండేందుకు మంచి పౌష్టికాహారాన్ని కూడా ప్రభుత్వం అందిస్తోంది.

ప్రతి రోజు గుడ్డు

గత ప్రభుత్వ హాయంలో వారానికి రెండు సార్లు మాత్రమే అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే పిల్లలకు గుడ్లు ఇచ్చేవారు. కానీ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం సెలవురోజు మినహా ప్రతి రోజూ పిల్లలకు గుడ్డు, పాలు అందిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే వారంతా పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన పిల్లలే. వారిలో చాలామంది పిల్లల తల్లిదండ్రులకు పౌష్టికాహారం అందించే పరిస్థితి ఉండదు. దీన్ని గమనించిన ప్రభుత్వం పిల్లలకు మంచి పౌష్టికాహారాన్ని అందిస్తోంది.

రోజుకో రకమైన ఆహారం

అంగన్‌వాడీ కేంద్రాల్లో చదివే పిల్లలకు ప్రభుత్వం రోజుకో రకమైన భోజనాన్ని అందిస్తోంది. దీంతో పిల్లలు తినేందుకు అమితంగా ఇష్టపడుతున్నారు. సోమవారం అన్నం దోసకాయ పప్పు, ఉడికించిన కోడి గుడ్డు, 100 మి.లీ పాలు పెడతారు. మంగళవారం పులిహోర, టమాటో పప్పు ఉడికించిన కోడి గుడ్డు, 100 మి.లీ పాలు ఇస్తారు. బుధవారం అన్నం ఆకుకూర పప్పు , ఉడికించిన కోడి గుడ్డు, 100 మి.లీ పాలు ఇస్తారు. గురువారం అన్నం, ఆకుకూర, ఉడికించిన కోడిగుడ్డు, 100 మి.లీ పాలు ఇస్తారు. శుక్రవారం అన్నం సొరకాయ పప్పు, ఉడికించిన కోడి గుడ్డు, 100 మి.లీ పాలు, శనివారం వెజిటుబుల్ రైస్, ఆకుకూర, ఉడికించిన కోడి గుడ్డు, 100 మి.లీ పాలు అందిస్తారు.

జిల్లాలో 2499 అంగన్‌వాడీ కేంద్రాలు

జిల్లాలో 2499 అంగన్ వాడీ కేంద్రాలు ఉన్నాయి. వాటి పరిధిలో 8,588 మంది గర్భిణులు ఉన్నారు. అదేవిధంగా బాలింతలు 9692 మంది, 6 నెలల నుంచి ఏడాది వయస్సు లోపు పిల్లలు 10, 351 మంది ఉన్నారు. 7 నెలల నుంచి 3 సంవత్సరాల లోపు పిల్లలు 34, 270 మంది ఉన్నారు. 3 సంవత్సరాల నుంచి 6 సంవత్సరాల లోపు పిల్లలు 25,150 మంది ఉన్నారు.

గర్భిణులు, బాలింతలకు టేక్ హోం రేషన్



గర్భిణులు, బాలింతలకు మంచి పౌష్టికాహారాన్ని ప్రభుత్వం అందిస్తోంది. వారి ఇంటికే వైఎస్సార్ సంపూర్ణ పోషణ (పౌష్టికాహారం కిట్)ను ప్రభుత్వం అందిస్తోంది. గర్భిణులకు నెలకు సరిపడా గుడ్లు, పాలు, బెల్లం, ఖర్జూరం, వేరుశనగ చెక్కీలు, రాగి పిండితో కూడిన కిట్లు అందిస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలు వచ్చే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. కాన్వెంట్ తరహాలో ఆంగ్ల బోధన, రుచికరమైన భోజనం కేంద్రాల్లో పెడుతున్నాం. గర్భిణులు, బాలింతల్లో పౌష్టికాహారం, రక్తహీనతను నివారించేందుకు ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు అందిస్తోంది.

– బి.శాంత కుమారి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారిణి

ఇష్టంగా తింటున్న పిల్లలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు భోజనం, గుడ్డు, పాలు వంటి పోషకాలతో రుచికరమైన భోజనాన్ని అందించడంతో ఇష్టంగా తింటున్నారు. కేంద్రాలకు నిర్దేశించిన మెనూ ప్రతిరోజూ అమలయ్యే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందుకోసం వైఎస్సార్ సంపూర్ణ పోషణ యాప్‌లో ప్రతి రోజూ పిల్లలకు పెట్టే భోజనం వివరాలు ఫొటో తీసి అంగన్‌వాడీలు అప్‌లోడ్ చేసేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

కరాటే పోటీల్లో పతకాలు


కరాటే పోటీల్లో సాధించిన పతకాలతో క్రీడాకారులు

విజయనగరం: విశాఖలో జరిగిన కరాటే పోటీలలో విజయనగరం క్రీడాకారులకు పలు పతకాలు లభించాయి. ఈ మేరకు కరాటే కోచ్ కానూరు సంతోష్ మంగళవారం విడుదల ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 10, 11వ తేదీలలో విశాఖలోని స్వర్ణభారతి స్టేడియంలో జరిగిన నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ మేయర్ కప్-2023లో కరాటే, కుమిటీ విభాగాల్లో జిల్లా క్రీడాకారులకు బంగారు, వెండి పతకాలు లభించాయని పేర్కొన్నారు. పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనగా అందరికీ పతకాలు లభించాయన్నారు. ఎస్.శ్రీకాంత్, పి.హేమంత్‌లు కరాటే, కుమిటీలో బంగారు పతకాలు సాధించగా యోచనకు కరాటేలో బంగారు, కుమిటీలో వెండి పతకం లభించిందని చెప్పారు. ఎం.హర్షవర్ధన్, కె శివగణేష్‌లు కరాటేలో బంగారు, కుమిటీలో కాంస్య పతకాలు సాధించారని తెలిపారు. బి.యశ్వంత్, జి.తిరుమల కరాటే, కుమిటీ విభాగాల్లో వెండి పతకాలు గెలుచుకోగా ఆంధ్రప్రదేశ్ కెన్యూర్యూ అధ్యక్షుడు కె.సుమన్ విజేతలకు పతకాలు అందజేశారని తెలిపారు. పట్టణానికి చెందిన విద్యార్థులు తమ కళాశాల క్రీడా ప్రాంగణంలో శిక్షణ పొంది ఈ పతకాలు సాధించడం పట్ల సాయి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కె.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ సాయిదేవమణి అభినందనలు తెలిపారు.

వెయిట్‌లిఫ్టింగ్‌లో జిల్లా క్రీడాకారుల సత్తా


ఇంటర్ యూనివర్సిటీ వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో సాధించిన పతకాలతో జిల్లా క్రీడాకారులు

విజయనగరం: ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు రాజమండ్రిలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో జరిగిన మెన్ అండ్ ఉమెన్ చాంపియన్‌షిప్ పోటీల్లో పలు పతకాలు సాధించి విజయనగరం జిల్లా కీర్తిప్రతిష్ఠలను చాటి చెప్పారు. నాలుగు రోజుల పాటు జరిగిన పోటీల్లో 45 కేజీల బరువులో తలపడిన బి.రాజేశ్వరి బంగారు పతకం కైవసం చేసుకోగా..49 కేజీల విభాగంలో బి.చంద్రిక కాంస్య పతకం దక్కించుకుంది. అదేవిధంగా 64 కేజీల విభాగంలో ఎస్.పల్లవి బంగారు పతకం..71 కేజీల విభాగంలో బి.నాని వెండి పతకం సాధించారు. 81 కేజీల విభాగంలో సీహెచ్ లక్ష్మి బంగారు పతకం, 87 కేజీల విభాగంలో వై.చైతన్యకుమారి కాంస్యం, 87 ప్లస్ విభాగంలో ఆర్ గాయత్రి బంగారు పతకం, 81 కేటగిరీలో కేవీ శ్రీరామ్ కాంస్య పతకం దక్కించుకున్నారు. ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన క్రీడాకారులను జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధి బి.లక్ష్మి, కార్యదర్శి చల్లా రాము, కోచ్ శ్రీనివాస్, అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

సెమీస్‌కు చేరిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు

- హోరా..హోరీగా సాగుతున్న స్కూల్‌గేమ్స్


బాక్సింగ్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

విజయనగరం: విజయనగరం వేదికగా జరుగుతున్న రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు హోరా..హోరీగా సాగుతున్నాయి. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్ బాక్సింగ్ ఇండోర్ స్టేడియంలో మూడు రోజుల పాటు నిర్వహించతలపెట్టిన పోటీలు రెండవ రోజు మంగళవారం కొనసాగాయి. అండర్-14,17,19 వయస్సు విభాగాల్లో బాల, బాలికలకు నిర్వహిస్తున్న పోటీలకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 960 మంది క్రీడాకారులు హాజరుకాగా..రెండవ రోజు ముగిసే సమయానికి మూడు వయస్సుల విభాగాల్లో పోటీలు సెమీస్ దశకు చేరుకున్నాయి. బుధవారం ఫైనల్స్ నిర్వహించిన అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా త్వరలో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ పోటీలను ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డోల మన్మథకుమార్, బాక్సింగ్ కోచ్ ఈశ్వరరావు, జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో కాంస్య పతకం


విజేత జాజిలిని అభినందిస్తున్న డైరెక్టర్ వింజమూరి విజయకుమార్

బొబ్బిలి: ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో గత వారం జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో బొబ్బిలి పట్టణంలోని ఐరిస్ హైస్కూల్ విద్యార్థిని సదాశివుని జాజిలి కాంస్య పతకం సాధించింది. స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న జాజిలి మంచి ప్రతిభ కనబర్చడంతో పాఠశాల డైరెక్టర్‌లు వింజమూరి విజయకుమార్, వి.వసంతకుమారి, ప్రిన్సిపాల్ శంకరరావు అభినందించారు.

గుంతలో పడి రెండు పశువుల మృతి


గుంతలో పడి మృతి చెందిన పశువులు వద్ద రోదిస్తున్న బాలకృష్ణ కుటుంబసభ్యులు

మెంటాడ(గజపతినగరం రూరల్): మండలంలోని మద్రివలస గ్రామం సమీపంలో ఉన్న చంపావతి నది గుంతలో పడి రెండు పశువులు మృతి చెందగా పశువుల కాపరి ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. మంగళవారం జరిగిన ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మద్రివలస గ్రామానికి చెందిన బాలకృష్ణ తన పశువులకు లంకె వేసి మేపిస్తుండగా చంపావతి నది సమీపానికి వచ్చేసరికి రెండు పశువులు నదిలోకి ప్రవేశించి ఒక్కసారిగా గుంతలో కూరుకుపోయాయి.అక్కడే ఉన్న బాలకృష్ణ పశువులను రక్షించేందుకు వెళ్లి ప్రమాదాన్ని పసిగట్టి తప్పించుకున్నాడు. ఇటీవల నది పరివాహక ప్రాంతంలో నాటుబళ్ల యజమానులు ఇసుకను తీసుకెళ్లేందుకు గుంతలను తవ్వి అలానే ఉంచేయడం, తుఫాన్ ప్రభావంతో చంపావతి నదిలో పూర్తిస్థాయిలో నీరు పారడంతో గుంతలను కనిపెట్టలేకపోయామని, పశువుల కాపరి చెప్పాడు. గ్రామాలను ఆనుకుని ఉన్న చంపావతి చుట్టూ ఇలాంటి గుంతలే అధికంగా ఉన్నాయని, ఇప్పటికైనా నదిని దాటేటప్పుడు ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని స్థానికులు కోరుతున్నారు.

బంగారం, నగదు చోరీ


వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ మురళీధర్

పార్వతీపురంటౌన్: స్థానిక ఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో గల వైకేఎం కాలనీలోని ఓ ఇంట్లో బంగారంతోపాటు నగదు చోరీకి గురయ్యాయి. సోమవారం అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటనపై డీఎస్పీ మురళీధర్ అందించిన వివరాలిలా ఉన్నాయి. వైకేఎం కాలనీలో ఉంటున్న సంభాన ప్రసాద్, రాణిల ఇంట్లో అర్ధరాత్రి సుమారు 1గంట నుంచి 2 గంటల మధ్యలో ఇద్దరు వ్యక్తులు ముసుగువేసుకుని ప్రవేశించారు. బెడ్‌రూంలోకి వెళ్లిన దొంగలు నిద్రలో ఉన్న ఇంటి యజమానురాలు రాణిని లేపి కత్తితో బెదిరించి బీరువాలో ఉన్న పది తులాల బంగారం, 65వేల నగదుతోపాటు మూడు తులాల పట్టీలను పట్టుకుపోయారు. దొంగలు ఇంటి నుంచి బయటకు వెళ్తున్న సమయంలో రాణి కేకలు పెట్టడంతో చుట్టుపక్కల వారు వచ్చి వెంటనే గస్తీ తిరుగుతున్న పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ ఎస్సై సంతోషికుమారి, క్రైం పరిశోధన పోలీసులు ఉదయ్, రాజశేఖర్‌లు సంఘటనా స్థలానికి వచ్చి బాధితుల వద్ద వివరాలను సేకరించి దర్యాప్తు ప్రారంభించారు.

జాతీయ స్థాయి పోటీలకు చైత్రిక ఎంపిక


జాతీయస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన చైత్రిక

పాలకొండ రూరల్: పట్టణానికి చెందిన బొడ్డేపల్లి చైత్రిక జాతీయస్థాయి అండర్-14 షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు ఆమె తల్లితండ్రులు శ్రీనివాసరావు, పూర్ణిమలు మంగళవారం విలేకరులకు తెలిపారు. తమ కుమార్తె మండలంలోని అన్నవరం డీఏవీ పాఠశాల ద్వారా విశాఖ రీజనల్, హైదరాబాద్ రీజనల్ స్థాయిలో జరిగిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. వచ్చేనెల 10వ తేదీన హర్యానాలోజరగనున్న జాతీయస్థాయి పోటీల్లో తలపడనున్నట్లు వివరించారు.

సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ కప్‌కు పొరాది విద్యార్థులు

బొబ్బిలి: ఈనెల 26 నుంచి మూడు రోజుల పాటు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో జరిగే సాఫ్ట్‌బాల్ ఫెడరేషన్ కప్‌కు పొరాది జెడ్పీ ఉన్నతపాఠశాలకు చెందిన సుప్రియ, ప్రశాంతిలు ఎంపికైనట్లు పీడీ నల్ల వెంకట నాయుడు, కోచ్ సత్యనారాయణలు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, ప్రజలు వారిని అభినందించారు.

ఆటో డ్రైవర్ నిజాయితీ


ఎస్సై సమక్షంలో గోల్డ్‌చైన్ అందుకుంటున్న విద్యార్థిని

రాజాం సిటీ: మండలంలో బొద్దాం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ బొర్రా వాసు తన నిజాయితీని చాటుకున్నాడు. రెండురోజుల క్రితం తనకు తన ఆటోలో తులంపావు బంగారు గొలుసు అతనికి దొరికింది. ఈ గొలుసు ఆటోలో ప్రయాణిస్తున్న వారిదిగా గుర్తించి రాజాం పోలీసులకు సమాచారం అందించాడు. ఇంతలో జీఎంఆర్‌ఐటీలో చదువుతున్న శ్రీకాకుళానికి చెందిన మాధవి అనే విద్యార్థిని రెండురోజుల క్రితం ఈ ఆటోలో ప్రయాణిస్తున్నప్పుడు బంగారు గొలుసుపోయినట్లు గుర్తించి తన కుటుంబసభ్యులతో వచ్చి మంగళవారం ఆటోడ్రైవర్‌ను కలిసి చెప్పింది. వెంటనే ఆటో డ్రైవర్ రాజాం ఎస్సై రవికిరణ్‌ను సంప్రదించి, విద్యార్థిని వివరాలు వెల్లడించాడు. దీంతో పోలీసులు పూర్తిస్థాయిలో పరిశీలించి, ఆ చైన్ విద్యార్థినిదేనని గుర్తించి ఎస్సై సమక్షంలో ఆమెకు ఆటోడ్రైవర్‌తో గోల్డ్‌చైన్ ఇప్పించారు. ఆటో డ్రైవర్ వాసు నిజాయితీని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

ఊరూరా వికసిత్ భారత్ సంకల్పయాత్ర

- గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్యశిబిరాలు


ఆయుష్మాన్ భారత్ కార్డులను అందిస్తున్న సిబ్బంది


సంచారవాహనాలలో నిర్వహిస్తున్న ప్రదర్శన


కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో వికసిత భారత్ సంకల్పయాత్ర ముమ్మరంగా సాగుతోంది. ఇంతవరకు జిల్లాలోని 150 గ్రామ పంచాయతీల్లో వికసిత భారత్ సంకల్పయాత్ర దిగ్విజయంగా పూర్తిచేశారు. ఈ యాత్రలో దాదాపు 1.30 లక్షల మంది ప్రజలు పాల్గొన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా వివిధ విభాగాల నుంచి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సాధారణ వైద్యపరీక్షలు మాత్రమే కాకుండా క్షయ, సికిల్‌సెల్ ఎనీమియా వంటి వాటిని గుర్తించేందుకు వైద్యపరీక్షలు చేశారు. 16,734మందికి వైద్యపరీక్షలు చేయగా, అందులో 6,446మందికి క్షయ పరీక్షలు, 554 మందికి సికిల్ సెల్ ఎనిమియా పరీక్షలు నిర్వహించారు. 1099 మంది మైభారత్ వాలంటీర్లుగా నమోదయ్యారు. ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన కింద 1383మంది నమోదు చేసుకున్నారు. వికసిత భారత్ సంకల్పయాత్రలో భాగంగా నిర్వహించిన పలు కార్యక్రమాల్లో గెలుపొందిన 589మంది మహిళలు, 340మంది విద్యార్థులు 1296మంది క్రీడాకారులను గ్రామ సభల్లో సత్కరించారు. 124 స్వయం సహాయక సంఘాల ప్రదర్శనలు, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 135మంది రైతులతో ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహించారు. ఆయుష్మాన్ కార్డులను 109 గ్రామ పంచాయతీల్లో శతశాతం పంపిణీ చేశారు. 74గ్రామ పంచాయతీల్లో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేశారు. 108కి పైగా గ్రామ పంచాయతీలు ఓడీఎఫ్ ప్లస్ గాను, 71 గ్రామ పంచాయతీల్లో శతశాతం భూమి రికార్డులు డిజిటల్ విధానంలో నమోదైనట్లు గుర్తించారు.

ఆకట్టుకుంటున్న కళాబృందాలు

వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన అంశాలపై అవగాహన కార్యక్రమాలను సంచార వాహనాల ద్వారా ప్రదర్శించడం, కళాబృందాలు వాటిని వివరించడం ప్రజలను ఆకట్టుకుంటుంది. స్థానిక ప్రభుత్వ యంత్రాంగం భాగస్వామ్యం కావడం, రోజువారీ కార్యక్రమాలకు నోడల్ అధికారులను కలెక్టర్ నిషాంత్ కుమార్ నియమించిన కారణంగా వికసిత సంకల్ప్ యాత్ర విజయవంతంగా సాగేందుకు దోహదపడుతోంది. ఈ కార్యక్రమానికి నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న డీపీఓ బి.సత్యనారాయణ జిల్లా, మండల అధికారులతో సమన్వయం చేస్తూ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నారు.